# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :13 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 07-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## పరిహారం ఇవ్వాలంటూ.. ప్రాజెక్టు పనులను అడ్డుకొని ఉదండాపూర్ నిర్వాసితుల దీక్ష

జడ్చర్ల టౌన్, మార్చి 06 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్యాకేజీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉదండాపూర్ నిర్వాసితులు ఇవాళ ప్రాజెక్టు పనులను అడ్డుకొని దీక్ష చేపట్టారు. జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామస్తులు గత కొన్ని రోజులుగా ప్యాకేజీ డబ్బులు ఇవ్వాలని రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఇందుకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించి మరోసారి సర్వే చేయించి అర్హులైన వారందరికీ పరిహారం ఇప్పిస్తామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే చేపట్టి వారం రోజులైనా పరిహారం డబ్బులు చెల్లించక పోగా.. 21 ఏండ్లు నిండి పెండ్లి అయిన యువకుల కుటుంబాలకు పరిహారం ఇవ్వటం లేదని ఆరోపిస్తూ ..యువకులు ప్రాజెక్టు వద్దకు వెళ్లి పనులను అడ్డుకొని అక్కడే బైఠాయించారు. తమ డిమాండ్స్ పరిష్కారం అయే వరకు పనులను జరగనివ్వమని నిర్వాసితులు తెలియజేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకొని నిర్వాసితులతో చర్చలు జరుపుతున్నారు.

## నేను ఎమ్మెల్సీ అడగడం లేదు.. అడగొద్దు కూడా..



హైదరాబాద్,కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఈరోజు ఢిల్లీకి పయనం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఎమ్మెల్సీ అడుగుతలేను..నేను అడగొద్దు కూడా అన్నారు. నాకు పార్టీ ఆల్రెడీ టికెట్ ఇచ్చింది.. పోటీ చేసిన పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఓడిపోయానని పేర్కొన్నారు. నేను మూడు సార్లు ఎమ్మెల్యేగా పని చేశా.. ఎమ్మెల్సీ కావాలని పడి పడి మరి అడిగే గుణం నాది కాదు అని వెల్లడించారు. మీడియా మిత్రులు ఎవరు కూడా ఎమ్మెల్సీ విషయంలో ఊహాగానాల వార్తలు రాయొద్దని జగ్గారెడ్డి తెలియజేశారు. ఇక, 2017లో రాహుల్ గాంధీ సభ ఏర్పాట్ల గురించి వారి దృష్టికి తీసుకెళ్లాడం కోసమే గత ఆరు నెలల నుంచి ఢిల్లీకి వెళ్లాలని అనుకుంటున్నాను.. రాహుల్ సభ ఆర్గనైజేషన్, ఎలాంటి పరిస్థితుల్లో సభ ఏర్పాట్లు చేశానో ఆ విషయాలన్నింటినీ ఆయనకే స్వయంగా చెప్పాలని ఇప్పుడు హస్తినకు పోతున్నాను.. ఢిల్లీకి వెళ్ళిన తర్వాత రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ కోరుతాను.. అపాయంట్మెంట్ దొరికితే అతడితో మాట్లాడుతాను అని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. అయితే, మరోవైపు..కాంగ్రెస్ ముఖ్యనేత విజయశాంతి సైతం ఢిల్లీ బాట పట్టారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటు కోసం ఆమె తన ప్రయత్నం మొదలు పెట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన ఆ మె తనకు సీటు కేటాయించాలని కోరారు. పార్టీ కోసం తాను చేసిన త్యాగాలు సహా మరికొన్ని విషయాలను పరిగణలోకి తీసుకోవాలని విజయశాంతి విజ్ఞప్తి చేసింది.

## నిన్ను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశా.. నితీశ్‌పై తేజస్వి కౌంటర్ ఎటాక్



బీహార్:బీహార్ రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ఆ రాష్ట్రంలో ఈ ఏడాది ఆఖరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ అధికార ఎన్డీఏ నేతలకు, ప్రతిపక్ష ఆర్జేడీ నేతలకు మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే రెండు వైపుల నుంచి ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయికి చేరాయి. తాజాగా సీఎం నితీశ్ కుమార్‌పై తేజస్వి యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నితీశ్‌ను తాను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశానంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల బీహార్ అసెంబ్లీలో నితీశ్ సర్కారు బీహార్‌కు ఏం చేసిందని తేజస్వి ప్రశ్నిస్తే.. నీ తండ్రిని నాయకుడిని చేసిందే నేనని నితీశ్ కౌంటర్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తేజస్వి యాదవ్ బుధవారం స్పందించారు. జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కు రెండుసార్లు రాష్ట్రంలో అత్యున్నత పదవిని దక్కించుకోవడానికి తానే సాయం చేసినట్లు చెప్పారు. చిక్కుల్లో పడ్డ ఆయన పార్టీని తానే ఆదుకున్నానని వ్యాఖ్యానించారు. 'సీఎం నితీశ్ కుమార్ మంగళవారం అసెంబ్లీలో ప్రసంగిస్తూ లాలూ ప్రసాద్ యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేసింది తానేనని చెప్పారు. లాలూ యాదవ్ చాలా మందికి ఎన్నో రకాలుగా సాయం చేశారు. ప్రధాన మంత్రులను చేసిన ఘనత లాలూకు ఉంది. లాలూ ప్రసాద్ యాదవ్ సంగతి వదిలేస్తే.. నితీశ్ గురించి చెప్పాలి. నితీశ్ పార్టీ చిక్కుల్లో పడ్డప్పుడు నేనే ఆదుకున్నా. ముఖ్యమంత్రి పదవిని నిలబెట్టుకోవడం కోసం ఆయన్ని నేను రెండుసార్లు కాపాడాను. లేదంటే ఆయన పార్టీ ఇప్పటికే అంతమైపోయి ఉండేది' అంటూ పాట్నాలో జరిగిన ఓ ర్యాలీలో మాట్లాడుతూ తేజస్వి ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బీహార్ అసెంబ్లీలో కూడా తేజస్వియాదవ్, నితీశ్‌కుమార్ మధ్య మాటల యుద్ధం జరిగింది. సీఎం నితీశ్ కుమార్ మాటిమాటికి 2005కు ముందు బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ పాలన గురించి విమర్శలు చేస్తుండటాన్ని తేజస్వి యాదవ్ తప్పుపట్టారు. 2005కు ముందు బీహార్‌లో ఏముంది..? అని నితీశ్ ప్రశ్నించడంపై తేజస్వి మండిపడ్డారు. 2005కు ముందు బీహార్ రాష్ట్రమే లేదా..? అని ఎదురు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఎం నితీశ్ స్పందిస్తూ.. '2005కు ముందు బీహార్‌లో ఏముంది..? నీ తండ్రిని నాయకుడిని చేసిన నేను ఉన్నా. మీ సొంత జాట్ వర్గీయులు కూడా లాలూను ఎందుకు నాయకుడిని చేశావని అడుగుతున్నారు. కానీ నేను ఇప్పటికీ నీ తండ్రిని సపోర్టు చేస్తున్నా' అని చెప్పారు. అనంతరం తేజస్వి మాట్లాడుతూ.. సీఎం నితీశ్ కుమార్ తన పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 2005కు ముందు పాలన గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్ 2005కు ముందు బీహార్‌లోనే ఇంజినీరింగ్ డిగ్రీ చేశారని గుర్తుచేశారు. 2005 కంటే ముందే బీహార్ నుంచి ఆయన కేంద్ర వ్యవసాయ మంత్రి అయ్యారని అన్నారు. ఇప్పుడు చర్చ జరుగుతున్న అసెంబ్లీ భవనం కూడా 2005 కంటే ముందు నిర్మించిందే అని చెప్పారు. బీహార్‌లో అన్నీ నితీశ్ కుమార్ సీఎం అయిన తర్వాతనే అందుబాటులోకి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నితీశ్ సర్కారు ఇంకో 40 ఏండ్లు పాలించినా 2005కు ముందు ప్రభుత్వాన్ని నిందించేలా ఉందని వ్యాఖ్యానించారు.

## మలక్‌పేటలో శిరీష హత్య కేసులో బిగ్ ట్విస్ట్..

హైదరాబాద్, మలక్ పేటలో శిరీష హత్య కేసులో సరిత క్రూరత్వంపై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ప్రొఫైల్ పిక్ లో ఆమె అసలు రంగు బయటపడింది. నన్ను తట్టుకుని నిలవాలంటే మూడే దారులు.. మారిపోవాలి, పారిపోవాలి, లేదా సచ్చిపోవాలి అంటూ సవాల్.. నువ్వు సవాలు విసరకు.. నేను శవాలు విసురుతా అని పోస్టులో సరిత పేర్కొనింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఇక, శిరీషను చంపేందుకు పలుమార్లు సరిత స్కెచ్ వేసినట్లు తేలింది. ఆమె గురించి తెలిసే భర్త దూరం పెట్టాడు.. అమెరికా నుంచి సరితను బలవంతంగా ఇండియాకు పంపించాడు. ఆరు నెలల క్రితం ఇండియాకు వచ్చిన సరిత అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయం గురించి ప్రశ్నించినందుకు శిరీషను కిరాతకంగా చంపేసింది సరిత. అయితే, శిరీష మర్డర్ కేస్ లో హాస్పిటల్ నిర్వాహకులను సైతం పోలీసులు ప్రశ్నించారు. ఐసీయూ పేషంట్ లకు ఇచ్చే మత్తు ఇంజెక్షన్లను హాస్పిటల్ నుంచి సరిత తీసుకెళ్లినట్లు మీకు తెలుసా అని క్వశ్చన్ చేయగా.. తమకు తెలీకుండానే తీసుకెళ్ళి ఉండవచ్చు అని పోలీసులకు హాస్పటల్ వర్గాలు స్టేట్మెంట్ ఇచ్చారు. కాగా, వివేరా హాస్పటల్లో మేనేజర్ గా సరిత పని చేస్తున్నారు. శిరీషకు మత్తు ఇంజెక్షన్ డోసేజ్ 5 రెట్లు పెంచి ఇచ్చినట్లు తేలింది. స్పృహ కోల్పోయిన తర్వాత శిరీషను ఊపిరి ఆడకుండా చేసి దిండుతో చంపేసింది నిందితురాలు సరిత.



## పేద,మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారిన ప్రభుత్వ తీరు



హైదరాబాద్: స్కాలర్‌షిప్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. విదేశీ విద్యా పథకం కింద ఎంపికై, విదేశాలకు వెళ్లిన విద్యార్థులు స్కాలర్ షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు. నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడం.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉందని మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి మూడు నెలలు పూర్తి కావస్తుందని, ఇప్పటివరకు మూడు రూపాయల బకాయిలు కూడా చెల్లించిన దాఖలు లేవని వెల్లడించారు.

రేవంత్ సర్కారుకు బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై ఉన్న ధ్యాస, పేద విద్యార్థుల చదువులకు బకాయిలు చెల్లించడంపై లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అగ్రవర్ణ పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన విదేశీ విద్య పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క విద్యార్థిని కూడా ఈ పథకం కింద ఎంపిక చేయలేదన్నారు. ఏడాదిన్నరగా ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయిందని చెప్పారు. కొందరు దరఖాస్తుదారులు ఇప్పటికే అప్పులు చేసి విదేశీ విద్యకు వెళ్లగా, మరికొందరు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పథకంలో ఎంపిక అవుతామేమో అనే ఆశతో ఇక్కడే ఉండి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి తక్షణమే స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని, విదేశీ విద్య పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తున్నాం..



న్యూఢిల్లీ,భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్ పర్యటనలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆయనపై ఖలిస్థానీ సానుభూతిపరులు దాడికి యత్నించడం కలకలం రేపుతోంది. ఈ అంశంపై భారత్ తాజాగా స్పందించింది. భద్రతాలోపంపై విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తూ.. గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'విదేశాంగ మంత్రి జైశంకర్ యూకే పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా ఉల్లంఘన ఫుటేజీని మేం చూశాము. వేర్పాటువాదులు, తీవ్రవాదుల రెచ్చగొట్టే చర్యలను, ప్రజాస్వామ్య స్వేచ్ఛ దుర్వినియోగం కావడాన్ని మేం త్రీవంగా ఖండిస్తున్నాము. ఇలాంటి సందర్భాల్లో ఆతిథ్య దేశం వారి దౌత్యపరమైన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చాలి. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం' అని ప్రకటనలో పేర్కొంది. కాగా, జై శంకర్ ఈనెల 4న యూకే పర్యటకు వెళ్లిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పర్యటనలో భాగంగా 9వ తేదీ వరకూ అక్కడే ఉండనున్నారు. ఈ నేపథ్యంలో పలు సమావేశాలకు హాజరవుతున్నారు. బుధవారం రాత్రి లండన్‌లోని ఛాథమ్ హౌస్ లో నిర్వహించిన అధికారిక సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు ముగించుకొని బయటకు వచ్చిన సమయంలో కొందరు ఖలిస్థానీ అనుకూల వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఖలిస్థానీ జెండాలను ప్రదర్శిస్తూ భారత్, కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ గుంపులోని ఓ వ్యక్తి భారత జెండాను చేత పట్టి మంత్రి కారుకు అత్యంత సమీపంలోకి దూసుకొచ్చాడు. జాతీయ జెండాను అవమానించేలా ప్రవర్తించాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. కారువైపు దూసుకొచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## భారతదేశ సెమీకండక్టర్ మార్కెట్ 2030 నాటికి 100 బిలియన్ డాలర్లు..

హైదరాబాద్, సెమీ కండక్టర్స్" ప్రతినిధులతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమైయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి కోరారు. సెమీ కండక్టర్స్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను కంపెనీకి వివరించారు. ఇక, 2030 నాటికి భారతదేశంలో సెమీ కండక్టర్ల పరిశ్రమ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత్య ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న %ూ× జ్ఓ%లో భాగస్వామ్యం కావాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతమైన మానవ వనరులను వినియోగించుకోవాలని చెప్పుకొచ్చారు. స్కిల్ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వామ్యం అయి.. సెమీ కండక్టర్ల పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయాలన్నారు. సెమీ కండక్టర్స్ తయారీకి సంబంధించిన RD యూనిట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను ఐటీ కోరారు. హైదరాబాద్‌లోని స్టార్టప్‌లు, యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.




## రాజీవ్‌గాంధీపై మణిశంకర్ అయ్యర్ వ్యక్తిగత విమర్శలు..

న్యూఢిల్లీ,దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీపై సొంత పార్టీ నేత, మాజీ కేంద్రమంత్రి మణిశంకర్ అయ్యర్ వ్యక్తిగత విమర్శలకు దిగారు. రాజీవ్ గాంధీ రెండు సార్లు చదువులో ఫెయిల్యూర్ అయ్యారని..అయినా కూడా ఆయన ప్రధానమంత్రి కావడం ఆశ్చర్యం కలిగించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. బీజేపీ అస్త్రంగా మార్చుకుంది.

మణిశంకర్ ఏమన్నారంటే..

రాజీవ్‌గాంధీ కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యషించేటప్పుడు రెండు సార్లు విఫలం చెందారని తెలిపారు. యూనివర్సిటీ ఇమేజ్‌ను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఉత్తీర్ణులవుతారని.. కానీ కేంబ్రిడ్జ్‌లోనూలండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలోనూ రెండు చోట్ల రాజీవ్ గాంధీ ఫెయిల్యూర్ అయ్యారన్నారు. అలాంటి వ్యక్తి.. దేశానికి ప్రధానమంత్రి అయినప్పుడు తాను చాలా ఆశ్చర్యపోయానని మణిశంకర్ అయ్యర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. బీజేపీ కోవర్టుగా మారి వ్యక్తిగత విమర్శలకు దిగారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ అయ్యర్ మండిపడ్డారు. అయినా చదువులో వైఫల్యం చెందడం పెద్ద విషయం కాదని%ొ% ఉత్తమ వ్యక్తులు కూడా కొన్నిసార్లు విఫలమయ్యారని చెప్పుకొచ్చారు. రాజీవ్.. చదువులో విఫలం అయి ఉండొచ్చు కానీ రాజకీయాల్లో విఫలం కాలేదు కదా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో రాజీవ్ గాంధీ విజయవంతమయ్యారని తారిఖ్ అన్వర్ అయ్యర్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన విధానాలను గుర్తుచేశారు. రాజీవ్ హయాంలోనే పంచాయతీ రాజ్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. అలాగే ఆయన వల్లే ఐటీ విప్లవం వచ్చిందన్నారు. అంతేకాకుండా కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచారని చెప్పారు. అలాగే శాస్త్రీయ పురోగతిని ప్రోత్సహించారని.. కేవలం ఐదు సంవత్సరాల్లోనే ఇంత గొప్ప విజయాలను రాజీవ్ సాధించారని గుర్తుచేశారు. మణి శంకర్ అయ్యర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి చరణ్ సింగ్ సప్రా కూడా ఖండించారు. కాంగ్రెస్‌లో ఉంటూపార్టీ ప్రతిష్టను పదే పదే దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. యూపీఏ హయాం లో కేంద్రమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం భావ్యం కాదని ఆరోపిం చారు. బీజేపీకి తొత్తుగా మారి.. లేనిపోని కథనాలు సృష్టిస్తున్నారని.. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత ఇదేనా? అని ప్రశ్నించారు. బహుశా వార్తల్లో ఉండేందుకు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు.. కాంగ్రెస్‌లో ఎంపీగా ఎందుకయ్యారని.. కేంద్రమంత్రిగా ఎందుకు పని చేశారని నిలదీశారు.



## నాలుగు లైన్ల రహదారి పనులకు డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన



ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని ముదిగొండ మండల కేంద్రం నుంచి వల్లభి వరకు 5 కిలోమీటర్లు (ముదిగొండ పట్టణ పరిధిలో) ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధులతో రహదారి విస్తరణతో పాటు డ్రైనేజ్, ఫుట్ పాత్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందుకు గాను 28కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆ పనులకు ముదిగొండ మండల కేంద్రంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజిమిల్ ఖాన్, సీపీ సునీల్ దత్, కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## తగ్గుతున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,రాబోయే రెండు రోజులు తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు వాతావరణశాఖ నిపుణుడు టీ బాలాజీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలు కాస్త కూల్‌గా మారనున్నాయి. ఆ జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు పేర్కొన్నారు. రాత్రితో పాటు తెల్లవారుజామున కూడా టెంపరేచర్లు కూల్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళ యధావిధిగా ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. కొంత వరకు హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కూడా కొంత గుడ్‌న్యూస్ చెప్పారు. ఇవాళ్టి రాత్రి నుంచి హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు తెలిపారు. అయితే నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో హీట్ ఉన్నా.. ఉదయం పూట మాత్రం టెంపరేచర్లు తగ్గనున్నట్లు వెల్లడించారు. ఇక నగర శివార ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు చెప్పారు. ఉత్తర భారతం నుంచి అకస్మాత్తుగా వీస్తున్న చలిగాలుల వల్ల ఈ మార్పు ఉంటుందన్నారు. ఉత్తర తెలంగాణ దిశగా ఆ శీతల గాలులు వీస్తున్నట్లు చెప్పారు. మార్చి 6, 7 తేదీల్లో.. ఉదయం ఉష్ణోగ్రతలు 10 నుంచి 12 డిగ్రీల మధ్య ఉండనున్నాయి. ఇక మధ్యాహ్నం మాత్రం 35 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ ఉండనున్నది. మార్చి 5, 7 తేదీల్లో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. ఉదయం పూట 14 నుంచి 15 డిగ్రీల టెంపరేచర్ ఉండనున్నది. ఇక మార్చి 9వ తేదీ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు మండనున్నాయి.

## తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

చెన్నై, కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బడ్జెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభా లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను పట్టుకున్న భార్య

హైదరాబాద్,వేరే మహిళలో అక్రమ సంబంధం పెట్టుకున్న భర్తను భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెంలో చోటుచేసుకుంది. భర్త గత కొద్ది నెలలుగా ఇంటికి రాకుండా ఉండటంతో భార్యకు అనుమానం వచ్చింది. దీంతో అతడిని నిలదీసింది. తీరా ఫోన్ లాక్కొని చూడగా అసలు విష యం బయటపడింది. ఫోన్‌లో ఛాటింగ్‌లు చూసి షాక్ అయిన భార్య శ్వేత తన కుటుంబ సభ్యులతో టీచర్ వాణి ఇంటికి వచ్చి భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. మహిళను భయంకరంగా చితకబాదింది. భయంతో భర్త ప్రశాంత్ గోడ దూకి పరారయ్యాడు. ఆ వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. తన తండ్రి మరణిస్తే వచ్చిన డబ్బులను వ్యాపారంలో పెడతా అని చెప్పి 30 లక్షల రూపాయలు, కారు, స్కూటీ, బంగారం తీసుకుని వెళ్లిన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళకి ఇచ్చాడని భార్య ఆరోపిస్తోంది. తనకి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది బాధితురాలు.

## సాఫ్ట్ కార్నర్ ఎందుకు ?

అమరావతి,వైసీపీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా బొత్స సత్యనారాయణ ఉన్నారు. ఒక విధంగా ఆయన సీఎం మెటీరియల్. ఉమ్మడి ఏపీకి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తరువాత సీఎం అవాల్సిన వారు. ఆయన పేరు కూడా చివరిదాకా పరిశీలనలోకి వచ్చి బ్యాడ్ లక్ తో ఆగింది. ఇక ఆయన 23 ఉమ్మడి జిల్లాల ఉమ్మడి ఏపీకి పీసీసీ చీఫ్ గా చేసిన నాయకుడుగా ఉన్నారు. అటువంటి బొత్స వైసీపీలో చేరడం అంటే అది వింతగానే చెప్పుకున్నారు.అయితే బొత్స తన రాజకీయం కోసం వైసీపీని ఆశ్రయించక తప్పింది కాదని కూడా అంటారు. ఇక బొత్సకు బలమైన సామాజిక వర్గం దన్నుగా ఉంది. అంతే కాకుండా ఆయన రాజకీయ వ్యూహాలు కూడా వేరే లెవెల్ లో ఉంటాయి. అంగబలం అర్ధబలం దండిగా ఉన్న బొత్సకు వైసీపీలో జగన్ అందుకే ఎక్కువగా విలువ ఇస్తారు. ఆయనను అయిదేళ్ళ పాటు మంత్రిగా కొనసాగించారు అంటే బొత్సకి ఇస్తున్న ప్రయారిటీగానే చూడాలి.ఇక ఇలా బొత్స ఓడగానే అలా శాసనమండలి మెంబర్ అయ్యారు. ఆ వెంటనే లీడర్ ఆఫ్ అపొజిషన్ గా కేబినెట్ ర్యాంక్ పదవిని సంపాదించారు. ఇక వైసీపీ అసెంబ్లీకి రాని నేపథ్యంలో శాసనమండిలే పెద్ద దిక్కుగా ఉంది. అక్కడ బొత్స తన అనుభవం అంతా ఉపయోగించి అధికారం పక్షాన్ని నిలదీస్తున్నారు.చిత్రమేంటి అంటే వైసీపీ నుంచి ఏ గొంతు పెద్దగా లేచినా అధికార పక్ష సభ్యులు గట్టిగా రివర్స్ ఎటాక్ చేస్తారు. అలాంటిది బొత్స ధాటీగా మాట్లాడుతున్నా పెద్దగా అధికార పక్షం నుంచి చెక్ పెట్టేది లేకుండా పోతోంది అంటున్నారు. అంతే కాదు బొత్స మీద పరుష పదజాలం కూడా ఉపయోగించడం లేదు. ఆయనకు కావాల్సినంత సేపు సభలో మాట్లాడే వీలు కల్పిస్తున్నారు. దాంతో బొత్స మండలిలో హైలెట్ అవుతున్నారు.ఇలా ఎందుకు అన్నదే ఇపుడు రాజకీయంగా చర్చ సాగుతోంది. వైసీపీలో ఇప్పటిదాక జగన్ తప్ప మరో పేరు వినిపించేది కాదు, కానీ వైసీపీ అసెంబ్లీకి వెళ్ళక పోవడం వల్ల మండలిలో బొత్స చాలా కీలకంగా మారిపోయారు ఆయన వాయిస్ మాత్రమే ఇపుడు వినిపిస్తోంది. దాంతో అమాంతం బొత్స ఇమేజ్ కూడా పెరిగిపోతోంది. ఏపీలో ప్రతిపక్ష నాయకుడు అంటే బొత్స అన్నంతగా పరిస్థితి ఉంది.ఇక రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న బొత్స కూడా తనకు దక్కిన ఈ అవకాశాన్ని ఏ మాత్రం వదులుకోవడంలేదు. ఆయన కూడా కూటమి ప్రభుత్వం మీద దూకుడు చేస్తూ పదునైన విమర్శలు చేస్తున్నారు.

# స్టేట్ వర్సెస్ సెంట్రల్.. తెలంగాణపై ఎందుకీ వివక్ష




హైదరాబాద్, అన్నీ ఇస్తున్నాం.. డోంట్ వర్రీ.. ఇదీ కేంద్రమంత్రుల మాట. మీరు ఇచ్చిందేంటి.. వచ్చిందేంటి.. ఇదీ తెలంగాణ ప్రభుత్వం అడుగుతున్న ప్రశ్న. దీనిపైనే ఇప్పుడు సవాళ్లు ప్రతి సవాళ్ల రాజకీయం నడుస్తోంది. పక్క రాష్ట్రాలకు ఫటాఫట్ ఇస్తూ తెలంగాణ దగ్గరికి వచ్చే సరికి ఎందుకు ఆగిపోతున్నారన్నది సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్న. గ్రాంట్ల రిలీజ్ దగ్గర్నుంచి బడ్జెట్ కేటాయింపుల దాకా అన్నిట్లోనూ అన్యాయమే అంటూ లెక్కలను జనం ముందు పెడుతున్నారు. ఇంతకీ తెలంగాణపై కేంద్రం చిన్న చూపు చూస్తోందా? ఏం జరుగుతోందో డీకోడ్ చేద్దాం. లెట్స్ వాచ్.

నిర్లక్ష్యానికి గురైన రంగాలపై ఫోకస్

రైట్ ఇదీ గత కొద్ది రోజులుగా కేంద్ర నిధులపై కంటిన్యూ అవుతున్న డైలాగ్. సీఎంకు, కేంద్రమంత్రులకు మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. మరి గ్రౌండ్ లో నిధుల ప్రవాహం ఎలా ఉంది? ఏం జరుగుతోంది? 2023, డిసెంబర్ 7న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. మార్చి 16 నుంచి జూన్ 6 వరకు లోక్ సభ ఎన్నికల కోడ్ అమలైంది. చెప్పాలంటే ఒక పది నెలలే పాలనకు అసలైన సమయం దొరికింది. ఉన్నంతలో ప్రాధాన్యాలపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ చేశారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన వాటిని పట్టాలెక్కించే పని పెట్టుకున్నారు.

కేంద్రంతో తగువులకు దూరం

కేసీఆర్ లా కాదు.. పదే పదే ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీ సహా కేంద్రమంత్రులను కలిసి వచ్చారు. వినతులు ఇచ్చారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పాటిస్తూ నిధుల కోసం అడిగారు. ఎన్నికలప్పుడే రాజకీయం.. మిగితా సమయాల్లో అభివృద్ధే లక్ష్యం అని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తగువులు పెట్టుకోబోమన్నారు. ప్రధాని పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. దేశ భద్రత ముఖ్యమని నేవీ రాడార్ కు స్థలం ఇచ్చారు. సో ఫెడరల్ సిస్టమ్ వాల్యూ పెంచుతూ.. కేంద్రానికి అన్ని విధాలుగా సహకరిస్తూ వస్తున్నారు సీఎం రేవంత్.

మెట్రో ఫేజ్ 2,RRR, మూసీ పునరుజ్జీవం

సీన్ కట్ చేస్తే కథ మరోలా ఉంటోంది. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పనుల విషయంలో కొన్ని ప్రయారిటీస్ పెట్టుకుంది. గత పదేళ్లుగా పట్టాలెక్కని వాటిపై ఫోకస్ పెట్టి నిధులు కోరుతోంది. అయితే ఢిల్లీ నుంచి అనుకున్నంతగా రావడం లేదన్నది సీఎం రేవంత్ రెడ్డి మాట. ఒత్తిడి పెంచితేనే కాస్తో కూస్తో వస్తున్నాయ్ తప్ప పెద్ద కార్యక్రమాలకు పైసా విదిలించడం లేదంటూ తాజాగా 9 పేజీల లేఖను రిలీజ్ చేశారు సీఎం రేవంత్. లెటర్ లో కొంచెం ఘాటు పెంచారు. ఒక్కసారి ఆ లేఖలో ఏముందో చూద్దాం. మెట్రో ఫేజ్ 2, రీజినల్ రింగ్ రోడ్, మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని బందరు సీ పోర్ట్‌కు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాలకు సంబంధించి అనుమతుల సాధనకు కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని, ప్రధానిని కూడా కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని లెటర్ లో ప్రస్తావించారు.

నిధులు అడ్డుకుంటున్నట్లు రుజువు చేయాలన్న కిషన్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని ఇటీవలే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. తాను ఏ ప్రాజెక్టుకి నిధులు రాకుండా ఆపుతున్నానో చెప్పాలని అనడంతో.. కేంద్రం ఏయే ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలో చెబుతూ రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఇందులో ఓ సింపుల్ లాజిక్ ఉందన్నారు. మెట్రో ఫేజ్ 2, మూసీ పునరుజ్జీవం తాను పూర్తి చేస్తే పేరు ఎక్కడ వస్తుందోనని ఆపుతున్నారన్నారు సీఎం. ఒకవేళ అదే కారణమైతే ఆ పేరు కూడా కిషన్ రెడ్డే తీసుకోవాలంటున్నారు సీఎం. నిధులు మాత్రం ఆపొద్దంటున్నారు.

గ్రాంట్ల నుంచి బడ్జెట్ కేటాయింపుల దాకా అంతంతే

కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత కార్యక్రమాలకు ఇచ్చే గ్రాంట్ల దగ్గర్నుంచి బడ్జెట్ కేటాయింపుల దాకా అడుగడుగునా అన్యాయమే జరుగుతోందని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రూపాయి లేకపోయినా మెట్రో ఫేజ్ 2 ప్రయత్నాలు చేయడమేంటని కిషన్ రెడ్డి అంటున్నారు. అయితే తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్రమంత్రులుగా ఉన్నారని, క్యాబినెట్ లో పెట్టించి నిధులు విడుదల చేయించే బాధ్యత ఆ ఇద్దరిపై ఎక్కువగా ఉందన్న విషయాన్ని సీఎం పదే పదే గుర్తు చేస్తున్నారు.

వెనుకబడిన జిల్లాలకు రావాల్సినవి రూ.1,800 కోట్లు

కేంద్ర ప్రాయోజిత పథకాలకే కాకుండా గ్రాంట్ల రూపేణా కూడా ఈ ఏడాది తెలంగాణకు పెద్దగా నిధులు రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపేణా 21 వేల 636 కోట్లు వస్తాయని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. అయితే, 2024 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 4,634 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. గ్రాంట్లు ఎక్కువగా రాకపోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి పెరిగింది. సంక్షేమ పథకాల అమలు, పాత అప్పులపై కిస్తీల చెల్లింపులకు ప్రభుత్వం మళ్లీ రుణాలనే సేకరించాల్సి వస్తోంది. వెనుకబడిన జిల్లాల్లో అభివృద్ధి పనులకు 1,800 కోట్లు రావాల్సి ఉంది. వాటిని రిలీజ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం పదే పదే కోరగా.. కేంద్రం ఈ ఏడాది 450 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద 3,277 కోట్లు వస్తాయని అంచనా వేయగా.. 8 నెలల్లో 2,819 కోట్లు మాత్రమే రిలీజ్ అయ్యాయి.

తెలంగాణలో 39 హైవేలకు రూ.5,658 కోట్లు నిధులు

తాజాగా కేంద్ర ఉపరితల రవాణా శాఖ బడ్జెట్ పద్దుల లెక్కల్ని రిలీజ్ చేయగా.. అందులో 39 హైవేలకు 5,658 కోట్లు నిధుల్ని కేటాయించారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణలో నేషనల్ హైవేస్ కోసం 7,394 కోట్లను ప్రతిపాదించగా.. ఈ ఏడాది మాత్రం దాని కంటే 1736 కోట్ల మేర కోత విధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్ఆర్ఆర్, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణలతో పాటు పునర్విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు ఢిల్లీలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి బడ్జెట్ పెట్టకంటే ముందే కేంద్ర పెద్దలను కలిసి వచ్చారు. అయినా సరే అనుకున్నంత పని కాలేదంటున్నారు. సో చెప్పుకుంటూ వెళ్తే కథ చాలానే దూరం ఉందన్న వాదనను వినిపిస్తున్నారు.

పవర్ ఫుల్ స్టేట్ కు కేంద్రం ఆసరా మరింత బెనిఫిట్

తెలంగాణకు ఎవరెవరు ఏమేం చేశారు.. తేలుద్దాం రండి ఇదీ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యర్థులకు వేసిన సవాల్. కేంద్రంలో మోడీ, గత పదేళ్ల కేసీఆర్ పాలన, అలాగే 12 నెలల కాంగ్రెస్ ప్రజాపాలన లెక్కలేంటో ఫటాఫట్ తేల్చేద్దామంటున్నారు. దీనికి బీజేపీ సై అన్నది. టైమ్ ప్లేస్ డిసైడ్ చేయాలన్నారు. సో ఇలా రాజకీయాలు మాత్రం సవాళ్లు ప్రతి సవాళ్లతో హీటెక్కుతున్నాయి. అయితే ఫైనల్ గా కావాల్సింది తెలంగాణకు జరగాల్సిన ప్రయోజనమే. ఇది డైనమిక్ స్టేట్. ఎక్కువ ఎకానమీ జెనరేట్ చేయగల స్టేట్. తలసరి ఆదాయం ఎక్కువున్న స్టేట్. ఏ రకంగా చూసినా పవర్ ఫుల్ స్టేట్ తెలంగాణ. అలాంటి వైబ్రంట్ సేట్ కు సెంట్రల్ ఫండ్స్ కూడా తోడైతే అభివృద్ధి నెక్ట్ లెవెల్ లో ఉంటుందన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన.

మెట్రో ఫేజ్ 2 తో విద్య, ఉపాధికి ఊతం

గతంలో కాంగ్రెస్ హయాంలోనే మెట్రో ఫేజ్ 1 మొదలైంది. మెట్రో వచ్చాక హైదరాబాద్ అభివృద్ధి మరింతగా పెరిగింది. పక్కన ఉన్న బెంగళూరు, చెన్నైకి కేంద్రం మెట్రో మలిదశకు అనుమతులు ఇచ్చింది. ఇప్పుడు సీఎం ఆలోచన ఏంటంటే.. మన హైదరాబాద్ లో కూడా మెట్రో ఫేజ్ 2 ఆరంభమైతే.. ట్రాన్స్‌పోర్టేషన్ మరింతగా పెరిగి విద్య, ఉద్యోగ ఉపాధి రంగాలు స్పీడ్ అందుకుంటాయంటున్నారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్ అయినా, మూసీ పునరుజ్జీవమైనా ఇదే ఆలోచనతో ఉన్నారు. నిజానికి సబర్మతీ, గంగా పునరుజ్జీవ పనులు చేసినప్పుడు మూసీ డెవలప్ మెంట్ కు ఎందుకు ఇవ్వరు అన్నది మరో ప్రశ్న సంధిస్తున్నారు. అక్కడ ఎలా చేయగలిగారు.. ఎలా ఇవ్వగలిగారు.. ఇక్కడెందుకు ఇవ్వలేకపోతున్నారన్న మౌలిక ప్రశ్నలను మాత్రమే ప్రస్తావిస్తున్నారు.

రాష్ట్ర ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టాలన్న సూచనలు

ప్రాజెక్టులపై మాట్లాడితే.. కేంద్రాన్ని అడిగి ఇచ్చారా? అన్న సమాధానం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైపు నుంచి వచ్చింది. దీంతో కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని సీఎం సవాల్ చేశారు. వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం సమంజసం కాదని, ఇకనైనా రాష్ట్ర ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సో ఈ సవాళ్లు ప్రతి సవాళ్లకు ముగింపు పలికి జరగాల్సిన పని జరిగేలా చూడాలన్న పాయింట్ కు చర్చను తీసుకొచ్చారు. నిజానికి అన్ని రాష్ట్రాలకు అందుతున్నట్లుగానే రెగ్యులర్ గా వచ్చేవి వస్తూనే ఉంటాయి.

ఎక్కడాలేని ఎకో సిస్టమ్ హైదరాబాద్ సొంతం

అయితే వీటికి అదనంగా హైదరాబాద్ అభివృద్ధి కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం ఇంకొన్ని చర్యలు అవసరం. వాటి కోసం ప్రయత్నిస్తే బెటర్ అన్న వాదన పెరుగుతోంది. ఎందుకంటే ఇది కీలకమైన సమయం. ఇప్పుడు వేగంగా అనుకున్న పనులు చేయగలిగితే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఎంతో మందికి విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా వెలుగుతున్న హైదరాబాద్ లో మరింతగా అవకాశాలు వస్తాయి. ఇది అవకాశాలను సృష్టించే నగరం. ఫార్మా నుంచి ఐటీ దాకా దేశంలో మరెక్కడా లేని ఎకో సిస్టమ్, మ్యాన్ పవర్, హ్యూమన్ రిసోర్సెస్ ఉన్న సిటీ ఇది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కేంద్రాన్ని నిధులు అడుగుతోంది.

యూపీ, బిహార్, MP, రాజస్థాన్ కే ఎక్కువ ఫండ్స్

నిజానికి తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అడగడానికి ప్రత్యేక కారణం కూడా ఉంది. కేంద్రం ఈ ఏడాది జనవరి పన్నుల వాటా కింద లక్షా 73 వేల 30 కోట్లు రిలీజ్ చేస్తే అందులో జనాభా ఎక్కువుండి, వెనుకబడ్డ రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఈ నాలుగు రాష్ట్రాలే ఏకంగా 72 వేల 450 కోట్లను దక్కించుకున్నాయి. అంటే 100 రూపాయలు చెల్లిస్తే 200 రూపాయలపైనే %ఖ్రా%, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు పొందుతున్నాయి. జస్ట్ 3 వేల 637 కోట్లే. ఆ లెక్కన తెలంగాణ రూపాయి కేంద్రానికి ఇస్తే తిరిగొస్తున్నది 42 పైసలే. ఓవరాల్ గా చూస్తే కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ ఇచ్చేది 3 లక్షల కోట్లైతే.. తెలంగాణ తిరిగి పొందుతున్నది 1.68 లక్షల కోట్లే. ఎంత వ్యత్యాసం ఉందో చూడొచ్చు. కనీసం ఈ లెక్కలు చూసినా తెలంగాణ రాష్ట్రం కోరుకున్న ప్రాజెక్టుల కోసం నిధులు ఇవ్వాలన్నది వాదన.

తెలంగాణ రూపాయి ఇస్తే తిరిగొస్తున్నది 42 పైసలే

సో మ్యాటర్ క్లియర్ గా ఉంది. పన్నుల వాటా ఎక్కువ ఇచ్చి.. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తెలంగాణలో ఇంకింత అభివృద్ధి జరిగితే దేశ ఎకానమీకే మేలు జరుగుతుందన్న వాదన వినిపిస్తున్నారు. మరి నిధుల విషయంలో ఒత్తిడి పెంచితేనే వస్తాయా అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ఏం జరుగుతుందన్నది చూడాలి.

# కేజ్రీ వ్యూహం మారితేనే మునుపటి క్రేజ్!



న్యూఢిల్లీ,ఈ ఎన్నికలలో ఓడించినంత మాత్రాన జాతీయ రాజకీయాలలో కేజ్రీవాల్ ఉనికిని ధ్వంసం చేశామనుకొంటే పొరపాటే కాగలదు. భారత రాజకీయ చరిత్రలోనే కుల బలం లేదా రాజకీయ వారసత్వ అండదండలు లేదా సినీ గ్లామర్ లేకుండా సామాన్య వ్యక్తిగా ఢిల్లీ మురికివాడల నుండి తన ప్రజాజీవనం ప్రారంభించి పుష్కరకాలం పాటు ఢిల్లీలో అధికారంలో ఉండటం ద్వారా కేజ్రీవాల్ ఓ చరిత్ర సృష్టించారని చెప్పవచ్చు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక సామెత చెబుతుండేవారు. పీవీజీ రాజు అధికారంలో ఉంటే, మర్రి చెన్నారెడ్డి ప్రతిపక్షంలో ఉంటె ప్రమాదమని కాంగ్రెస్ అదిష్ఠా నం భావించేది. అందుకనే పీవీజీ రాజు నాటి ప్రధాని పండిట్ నెహ్రూతో తలపడగల నేత అయినప్పటికీ పీవీజీ రాజును పదవులకు చాలావరకు దూరంగా ఉంచేవారు. కేంద్రం లో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మా త్రం చెన్నారెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేవారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవి నుంచి దించి నా గవర్నర్ పదవిలో ఉంచేవారు గానీ ఖాళీగా ఉండనిచ్చేవారు కాదు. అదేవిధంగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు పార్లమెంటులో ఉన్న సంఖ్యాబలం చెప్పుకోదగినది కానప్పటికీ అయన ఉనికి చూస్తేనే ప్రధాన జాతీ య పక్షాలైన బిజెపి, కాంగ్రెస్ భయపడుతున్నాయి.ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేదనుకున్న కేజ్రీవాల్ ను పట్టుబట్టి ఈ రెండు పక్షాలు ఓడించాయి. అందుకోసం 27 ఏళ్ళ తర్వాత బిజెపి అధికారంలోకి వచ్చేందుకు పరోక్షంగా కాంగ్రెస్ సహకరించింది. వరుసగా మూడోసారి ఒక్క ఎమ్మెల్యే సీటు గెలవలేక పోయినా ఆప్‌కు అధికారం దక్కక పోవడంతో కాంగ్రెస్ సంబరాలు చేసుకున్నట్లు కనిపిస్తున్నది. ఓ కార్పొరేషన్ మేయర్‌కు మించిన అధికారాలు లేని అలంకారప్రాయమైన ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిలో ఆప్ ప్రతినిధి ఉండడాన్ని ఈ రెండు పార్టీలు సహించలేక పోవడం చూస్తుంటే కేజ్రీవాల్ ఉనికి పట్ల వారిలో నెలకొన్న భయాందోళనలు వెల్లడి అవుతున్నాయి. అయితే ఈ ఎన్నికలలో ఓడించినంత మాత్రాన జాతీయ రాజకీయాలలో కేజ్రీవాల్ ఉనికిని ధ్వంసం చేశామనుకొంటే పొరపాటే కాగలదు. భారత రాజకీయ చరిత్రలోనే కుల బలం లేదా రాజకీయ వారసత్వ అండదండలు లేదా సినీ గ్లా మర్ లేకుండా సామాన్య వ్యక్తిగా ఢిల్లీ మురికివాడల నుండి తన ప్రజాజీవనం ప్రారంభించి పుష్కరకాలం పాటు ఢిల్లీలో అధికారంలో ఉండటం ద్వారా కేజ్రీవాల్ ఓ చరిత్ర సృష్టించారని చెప్పవచ్చు.పైగా గుర్తింపు పొందిన ఆరు జాతీయ పార్టీలలో ఒకటిగా ఆప్‌కు గుర్తిం పు తెచ్చుకోగలిగారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్ వం టి నేతలతో పాటు వందేళ్ల చరిత్ర గల సిపిఐ సహితం ఈ విషయంలో విఫలమయ్యాయి. సాంప్రదాయకంగా ఢిల్లీ ద్విముఖ రాజకీయ చిత్రాన్ని త్రిముఖంగా మార్చడం ద్వారా కేజ్రీవాల్ రాజధాని రాజకీయాల గతిశీలతను మార్చారు. ఢిల్లీ ప్రయోగాన్ని ఇతరత్రా పునరావృతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. పంజాబ్‌లో విజ యం సాధించారు. గత వారంలోనే గుజరాత్ లో ఆప్ 30 మునిసిపల్ సీట్లను గెలుచుకుంది. సాంప్రదాయ పార్టీలు, స్వార్థ ప్రయోజనాల నుండి మార్పు కోరుకునే వారికి ప్రత్యామ్నాయ వేదికగా ఆప్‌ను మార్చగలిగారు. నిజానికి, కేజ్రీవాల్ ఎదుర్కొన్న ప్రభుత్వ వ్యతిరేకత, ఇతర లోపాలను పరిగణనలోకి తీసుకుంటే, ఢిల్లీ ఎన్నికలలో ఆప్ పనితీరు కొట్టిపారవేయగలిగింది కాదు. ఆప్ 22 సీట్లతో పోలి స్తే బీజేపీ 48 సీట్లతో ముందంజలో ఉన్నప్పటికీ, ఓట్ల శాతంలో తేడా కేవలం 2.06% మాత్రమే. 14 నియోజకవర్గాల్లో, బీజేపీ విజయంలో స్వల్ప తేడా కాంగ్రెస్ అభ్యర్థులు పోలైన ఓట్ల కంటే తక్కువగా ఉంది. సమాజంలోని అత్యంత పేద వర్గాలలో, తక్కువ ఆదాయ మహిళా ఓటర్లలో ఆప్ తన పట్టును నిలుపుకుందని సీఎస్‌డీఎస్ సర్వే సూ చించింది.ఆ పార్టీ సాధారణ కుల కార్డును కాకుండా ఉచితాలతో అణగారిన ఓటర్లను ఆకర్షించడంపై దృష్టి పెట్టింది. ఉదాహరణ కు, కేజ్రీవాల్ తన సామాజిక వర్గం కారణంగా రాజకీయం గా పెద్దగా ప్రయోజనం పొందలేదు. ఢిల్లీలో కేజ్రీవాల్ అపూర్వమైన పెరుగుదల భారత రాజకీయాల్లో అపూర్వమైనది. బీహార్‌లో కొత్త పార్టీని స్థాపించిన పోల్‌స్టర్ ప్రశాం త్ కిషోర్‌తో సహా ఆశావహ రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకం. పెద్దగా ఎవ్వరికీ తెలియని ఓ చిన్న ఎన్జీ ఓ కార్యకర్త అయిన కేజ్రీవాల్ కొత్త పార్టీని స్థాపించడం, కేవలం 13 నెలల్లోనే ముఖ్యమంత్రిగా కావడం విచిత్రమే. పైగా, మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన షీలా దీక్షిత్‌ను ఓడించారు. ఎన్టీ రామారా వు, ఎంజీ రామచంద్రన్ వంటి వారు రాత్రికి రాత్రే కీలక రాజకీయ నాయకులుగా మారినా వారికి ఘనమైన పూర్వరంగం, ప్రజలలో పలుకుబడి ఉన్నాయి.అవేమీ లేకుండా 2011 లో, యుపిఎ ప్రభుత్వం లో పెద్ద అవినీతి కుంభకోణాలను, 2012లో దిగ్భ్రాంతికరమై న నిర్భయ అత్యాచార కేసు సందర్భంగా పెల్లుబికిన ప్రజాగ్రహావేశాలను అదనుగా మార్చుకున్నారు. వాస్తవానికి ఢిల్లీలో ప్రారంభమైన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని పనిచేస్తూ, ఆర్ఎస్ఎస్ రామ్‌దేవ్‌ను ఆసరాగా చేసుకుని, జంతర్ మంతర్ వద్ద జనసమూహా న్ని పెంచే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో మహారాష్ట్రకు పరిమితమైన అన్నాహజారేను తీసుకొచ్చి అవినీతి వ్యతిరేక జాతీయ ఉద్యమంగా మలచిన ఘనత కేజ్రీవాల్‌కే దక్కుతుంది. ఈ ఉద్యమంలో ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్, కిరణ్ బేడీ వంటివారు చేరినా వారెవ్వరికి ప్రజలను సమీకరించే సామర్థ్యం లేదు. చివరికి ఈ ఉద్యమాన్ని ఓ రాజకీయ పార్టీగా మలచి రాజకీయాల పట్ల విసుగుచెందుతున్న ప్రజలకు ఓ నూతన ఆశాజ్యోతిగా కేజ్రీవాల్ నిలిచారు.

## స్పీకర్‌ను కించపరిచేలా చేయవద్దు

అమరావతి,వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రతిపక్ష బాధ్యతను నిర్వహించకుండా ఆ హోదా కోరుకోవడం శోచనీయమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సభలో గవర్నర్‌ను అవమానించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల్లో శాసనసభలన్నీ పార్లమెంట్ సంప్రదాయాలనే అనుసరిస్తాయన్నారు. సెక్షన్ 121 సి ప్రకారం ఏదైనా సభలో సభ్యుల సంఖ్యలో పదో వంతు ప్రతిపక్షానికి ఉండాలని లోక్‌సభలో రూలింగ్ ఉందని లోకేశ్ గుర్తుచేశారు. తెదేపాకు ఉన్న 23 మంది శాసనసభ్యుల్లో ఐదుగురిని లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదంటూ గతంలో సీఎంగా జగన్ చేసిన వ్యాఖ్యలను లోకేశ్ ప్రస్తావించారు. ఇప్పుడు స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ సభ గౌరవాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజాతీర్పును గౌరవించి వారి కోసం పోరాడాల్సిన బాధ్యత పార్టీలదేనని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ భద్రత జగన్‌కు కల్పిస్తున్నామన్నారు. తగిన సభ్యులు లేకుండా ప్రతిపక్ష హోదా కోరుకుంటూ దుష్ప్రచారం చేసే సంప్రదాయం కొనసాగకూడదన్నారు. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చామన్నారు. స్పీకర్‌పై తప్పుడు రాతలు బాధాకరమన్నారు. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారని, ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉందన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదని, చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి చెప్పుకొచ్చారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. 'చట్టసభలు చూస్తూ పెరిగా. చిన్నవయసులో చట్టసభలను చూశాను. అప్పట్లో వ్యక్తిగత దూషణలు ఉండేవి కావు, ప్రజలకు ఏమి కావాలో దానిపైనే చర్చలు జరిగేవి. చట్టసభల్లో ఇది నాకు రెండో అవకాశం. తొలిసారి శాసనసభకు వచ్చా. ఇటీవల ప్రతిపక్ష సభ్యులు బాధ్యత లేకుండా గవర్నర్ స్పీచ్‌ను డిస్టర్బ్ చేసి వెళ్లారు. గతంలో మేం నిరసన తెలియజేసినపుడు బెంచిల వద్దే ఉండి ధర్నా చేశాం. పోడియం వద్దకు రాలేదు, మేం ఎప్పుడూ లక్ష్మణరేఖ దాటలేదు. నేను అసెంబ్లీలో కొత్త మెంబర్. పార్లమెంటులోని 121సి నిబంధన ప్రకారం ప్రతిపక్ష హోదాకు టోటల్ నెం.లో 1/10 ఉండాలని స్పష్టంగా ఉంది. అసెంబ్లీ కండీషన్స్ ఫర్ రికగ్నిషన్లో కూడా ఈ విషయం పొందుపర్చబడి ఉంది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం హౌస్ పరువు తగ్గిస్తుంది. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉంది. జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదు. చట్టాన్ని ఉల్లంఘించడం, దానిని హౌస్ పైన రుద్దడం బాధాకరం. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదు. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాపై వైకాపా నేతలు కావాలనే బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. జగన్ తనకు లేని అధికారాన్ని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గౌరవం ఇవ్వకుండా ఛీ కొట్టినప్పుడు హోదా ఇవ్వాలని


# జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ది



న్యూఢిల్లీ,పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్ధారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.

# ఒక ఎమ్మెల్సీ! బాస్ ఎవరిని కరుణిస్తారో?

హైదరాబాద్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక స్థానం దక్కనుంది. దాంతో గులాబీ పార్టీలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. దూరమైన ఓటు బ్యాంకును దగ్గర చేసుకోవడానికి కేసీఆర్ ఆ స్థానాన్ని బీసీ, ఎస్సీ వర్గం నేతల్లో ఒకరికి కేటాయిస్తారన్న చర్చ జరుగుతుంది. దాంతో ఆయన వర్గాలకు చెందిన నేతలు అధినేతను కలిసేందుకు ఫాంహౌస్ బాట పడుతున్నారు. సోజు, సత్యవతి రాథోడ్, ఆర్ఎస్పీ పేర్లు రేసులో ఫోకస్ అవుతున్నాయి. పలువురు మాజీలు సైతం పదవిపై ఆశలు పెట్టుకుని పావులు కదుపుతున్నారంట.



### ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ స్థానం

తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో అయిదు ఎమ్మల్సీ స్థానాలకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 29కి బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు, ఒక ఎంఐఎం ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనుంది. అయితే ఈ సారి బీఆర్ఎస్‌కు ఒక్క ఎమ్మెల్సీ స్థానమే దక్కనుంది . ఆ క్రమంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎవరికి అవకాశం ఇస్తారనేది హాట్ టాపిక్ గా మారింది. పోటీ తీవ్రంగా ఉండటంతో, పార్టీ అధినేత కేసీఆర్ ఆశిస్సులు ఎవరికి ఉండనున్నాయి. బీసీకి ఇస్తారా? ఎస్సీకి ఇస్తారా? అనే చర్చకూడా పార్టీలో జోరందుకుంది. ఇప్పటికే పలువురు ఆశావాహులు ఫాంహౌస్‌లో ఉంటున్న అధినేత వద్దకు క్యూ కడుతున్నట్లు సమాచారం. ఎస్టీకి మళ్లీ అవకాశం కల్పించే అవకాశాలు ఉన్నాయని కూడా పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ఒక్క స్థానం కోసం పోటీ పడుతున్న పలువురు సీనియర్లు

రాష్ట్రంలో ఎమ్మెల్సీ కోటా ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ సైతం ప్రారంభమైంది. అయితే ఖాళీ అవుతున్న ఆ ఐదు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్య పరంగా ఒక స్థానం దక్కనుంది. దీంతో ఆ స్థానం కోసం పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధినేత కేసీఆర్ ఉన్న ఎర్రవెల్లి ఫాం హౌజ్ కు సైతం వెళ్లి కలిసి వస్తున్నట్లు సమాచారం. అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. మరోవైపు కేసీఆర్ కు అత్యంత సన్నిహితులతోనూ మంతనాలు చేస్తున్నారు. అంతేకాదు కేటీఆర్, కవిత, హరీష్ రావుతోనూ తమకు ఎమ్మెల్సీ సీటు వచ్చేలా చూడాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఎవరికి వారుగా ఆశావాహులు తమ స్టైల్లో లాబీయింగులు మొదలుపెట్టారు.

### బీసీ రాగం వినిపిస్తున్న గులాబీ పార్టీ

ఒకస్థానం మాత్రమే ఉండటంతో ఏ వర్గానికి టికెట్ ఇస్తారనేది పార్టీలో చర్చజోరందుకుంది. ప్రస్తుతం పార్టీ బీసీ రాగం అందుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేపై విమర్శలు గుప్పిస్తుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 42శాతం రిజర్వేషన్ కల్పించాని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది. ఈ తరుణంలో బీసీలకు ఎమ్మెల్సీ టికెట్ ఇస్తారా? లేకుంటే బీఆర్ఎస్ బీసీ వాదానికే పరిమితం అవుతుందా? అనేది హాట్ టాపిక్ గా మారింది. బీసీల నుంచి దాసోజు శ్రవణ్ ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం.

### అధినేత దగ్గరకి క్యూ కడుతున్న ఆశావహులు

శ్రావణ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని గులాబీబాస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే హామీ ఇచ్చారు. అప్పటి గవర్నర్ తమిళిసైకి దాసోజు శ్రావణ్ పేరు కూడా చేర్చి లిస్టు పంపించగా ఆమె దాన్ని రిజెక్ట్ చేశారు. అప్పటి నుంచి దాసోజుకి పదవుల పరంగా ప్రాధాన్యత దక్కలేదు. దాంతో ఈ సారి ఎమ్మెల్యే కోటాలో అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరుగుతుంది. బీసీ కోటాలో దాసోజుతో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీలు వీజీగౌడ్, స్వామిగౌడ్ సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

### ఒక్క స్థానం కోసం పోటీ పడుతున్న పలువురు సీనియర్లు

ఎస్టీ సామాజిక వర్గం నుంచి పదవీ కాలం ముగియనున్న మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తిరిగి ఆశిస్తున్నట్లు తెలిసింది. కేసీఆర్ తోపాటు కేటీఆర్ ను సైతం ఈ విషయంపై కలిసినట్లు సమాచారం. మరోవైపు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్, రసమయి బాలకిషన్ , మైనార్టీల నుంచి మాజీ మంత్రి మహమూద్ అలీ, సీనియర్ నాయకుడు సలీం సైతం ఎమ్మెల్సీ పోస్టు ఆశిస్తున్నారంట. వీరుకాకుండా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ స్థానం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారంట.

### రెండో స్థానానికి పోటీచేసే ఆలోచనల బీఆర్ఎస్

అదలా ఉంటే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులను నిలిపే ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి 28మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇద్దరు అభ్యర్థులకు సరిపోను బలం లేదు. అయినా రెండో స్థానానికి పోటీ చేసి పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ స్కెచ్ గీస్తోందట. ఆ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరారు. వారికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విప్ జారీ చేసే ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. ఇప్పటికే ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించడానికి గులాబీ పార్టీ న్యాయపోరాటం చేస్తోంది. ఈ ఎన్నికల్లో పార్టీ మారిన వారు విప్‌ను ఉల్లంఘిస్తే దాన్ని కోర్టులో అస్త్రంగా మలుచుకోవాలన్నది పార్టీ పెద్దల ఆలోచనగా ఉందంటున్నారు. మరి చూడాలి కారు పార్టీ లెక్కలు ఎలా వర్కౌట్ అవుతాయో?

# విడదల రజినికి బిగుస్తున్నఉచ్చు!

అమరావతి,మంత్రిగా ఉన్నప్పుడు ఇష్టానుసారం చెలాయించి, కలెక్షన్ క్వీన్ అనిపించుకున్న మాజీ మంత్రి విడదల రజినికి ఏసీబీ ఉచ్చు బిగిస్తోంది. అక్రమ వసూళ్లలో ఆమెకు సహకరించిన అధికారులు కూడా కేసుల చట్రంలో చిక్కుకుంటున్నారు. స్టోన్ క్రషర్ ఓనర్లను బెదిరించి కోట్లు వసూలు చేసినట్లు రజిని అండ్ టీమ్‌పై సదరు బాధితులు ఫిర్యాదు చేశారు. దాంతో ఆమె విచారణకు అనుమతి కోసం ఏసీబీ గవర్నర్‌కు లేఖ రాసింది. ఇప్పటికే ఆమెకు సహకరించిన ఐపీఎస్ అధికారి జాషువాపై విచారణకు గ్రీన్‌సిగ్నల్ లభించడంతో త్వరలో కేసు నమోదవ్వడం ఖాయంగా కనిపిస్తున్నది. దాంతో అరెస్టుల పర్వంలో నెక్ట్స్ రజినినే అంటున్నారు.పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమానులను బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలుచేశారన్న అభియోగాలతో వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజిని, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాపైపై కేసు నమోదుకు రంగం సిద్ధమైంది. రజిని అధికారంలో ఉన్నప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలోని యడ్లపాడులోని స్టోన్‌క్రషర్ ఓనర్లను అయిదు కోట్లు డిమాండ్ చేసి రూ.2.20 కోట్లు ముక్కుపిండి వసూలు చేయించారంట.ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి ఐపీఎస్ అధికారి జాషువాపై విచారణ చేపట్టేందుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం ఏసీబీ తాజాగా సీఎస్ అనుమతి తీసుకుంది. విడదల రజినిపై విచారణకు అనుమతి కోసం గవర్నర్‌కు లేఖ రాసింది. ప్రస్తుతం అది అక్కడ పెండింగ్‌లో ఉంది. ఒకటి, రెండు రోజుల్లో ఆమోదం లభించే అవకాశముందంటున్నారు. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే కేసు నమోదు చేయనున్నారు. శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమానులను బెదిరించి, అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రూ.5కోట్లు డిమాండు చేసి.. రూ.2.20 కోట్లు వసూలు చేశారని, అందులో రజినికి రూ.2 కోట్లు, జాషువాకు రూ.10 లక్షలు, రజిని పీఏకు రూ.10 లక్షలు చెల్లించారని విజిలెన్స్ తేల్చింది. దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించగా.. కేసు నమోదు కోసం అవసరమైన అనుమతులు ఏసీబీ అధికారులు తీసుకుంటున్నారు. 2020 సెప్టెంబరు 4న అప్పటి చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని పీఏ రామకృష్ణ... శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్‌క్రషర్ వద్దకు వెళ్లి ఎమ్మెల్యే పిలుస్తున్నారని, వెంటనే రావాలని యజమానులకు



హుకుం జారీచేశారంట. అప్పటికి రజినికి జగన్ ఇంకా మంత్రి పదవి ఇవ్వలేదు. ఎమ్మెల్యేగానే దందాలు మొదలు పెట్టిన రజినిని క్రషర్ ఓనర్లు కలవగా.. క్రషర్ కార్యకలాపాలు కొనసాగాలంటే తనకు రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండు చేశారంట. తర్వాత కొన్నాళ్లకే నాటి గుంటూరు జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఉన్న పల్లె జాషువా క్రషర్‌లో తనిఖీలు చేశారు. అనేక అవకతవకలు ఉన్నాయని, రూ.50కోట్ల జరిమానా చెల్లించాలని యజమానులను బెదిరించారు.కొన్నాళ్ల తర్వాత జాషువా వారికి ఫోన్‌చేసి విడదల రజిని చెప్పినట్లు చేస్తారా? లేదా రూ.50 కోట్ల జరి మానా విధించి.. క్రషర్ సీజ్ చేసేయాలా? అని బెదిరించారంట. కొన్నాళ్ల తర్వాత క్రషర్ యజమానులను తన కార్యాలయానికి పిలిపించుకుని, త్వరగా సెటిల్ చేసుకోవాలని హెచ్చరించినట్లు విజిలెన్స్ నివేదిక పేర్కొంది .జాషువా నుంచి ఒత్తిడి పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్టోన్‌క్రషర్ యజమానులు డబ్బులు చెల్లించాల్సి వచ్చిందంట. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే క్రిమినల్ కేసులు పెడతామని, వ్యాపారం మూయించేస్తామని బెదిరించారంట. ఆ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ప్రభుత్వానికి నివేదించడంతో దాని ఆధారంగానే ఇప్పుడు ఏసీబీ కేసు నమోదు చేయనుంది. ఆ క్రమంలో అరెస్టుల పర్వంలో ఇప్పుడు విడదల రజిని వంతు వచ్చిందన్న టాక్ వినిపిస్తోంది.

# వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు



వాషింగ్టన్,వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండింతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. ఏ దేశాలు.. తమ ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తాయో.. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చమురు, గ్యాస్ తవ్వకాల గురించి తన ఆలోచనలు వెల్లడించారు. ఏ దేశానికీ లేనివిధంగా మన కాళ్ల కింద ద్రవరూప బంగారం (చమురు, గ్యాస్‌ను ఉద్దేశించి) ఉందని, అది ద్రవ్యోల్బణ సమస్యను తీరుస్తుందని అన్నారు. 'ద్రవ్యోల్బణ సమస్యను పారదోలడం కోసం మేం చేసే పోరాటంలో భాగంగా ఇంధన వ్యయాన్ని వేగంగా తగ్గించడంపై దృష్టిపెట్టాం. బైడెన్ పాలనలో 100కు పైగా విద్యుత్ ఎ÷-లాంట్లు మూసివేశారు. వాటిలో చాలా ఎలాంట్లను మేం ఇప్పుడు తెరవబోతున్నాం. అందుకే నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని విధించాను. మన కాళ్ల కింద బంగారాన్ని తోడటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

# బీఫ్ ఎక్స్ పోర్ట్స్ లో ఇండియా దూసుకుపోతోంది!



న్యూఢిల్లీ,బీఫ్ ఎక్స్ పోర్ట్స్ లో ఇండియా దూసుకుపోతోందని అంటోంది ది యూనైటెడ్ స్టేట్స్ డిపార్ట్ మెంట్ ఆఫ్ అగ్రికల్చర్! ఇందులో విదేశీ కుట్ర ఏమీ లేదు, ఇండియా నుంచి బీఫ్ ఎగుమతుల గురించి ఈ సంస్థ గణాంకాలనే చెప్పింది. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ఇండియా నుంచి చాలా ఎక్కువ స్థాయిలో బీఫ్ ఎగమతులు ఉంటాయని ఈ సంస్థ అంచనా వేస్తోంది.గత ఏడాదిలో ఇండియా నుంచి 4.57 మిలియన్ టన్నుల బీఫ్ ఎగుమతి జరిగిందట. ఈ ఏడాది అది 4.64 మిలియన్ టన్నుల స్థాయికి చేరవచ్చని ఈ సంస్థ అంచనా వేస్తోంది. తొలి రెండు నెలల వ్యవధిలో బీఫ్ ఎగుమతులు పెరిగిన నేపథ్యంలో గతం కన్నా ఈ సారి ఎక్కువ స్థాయిలో గొడ్డు మాంసం ఎగుమతులు ఉంటాయని ఈ సంస్థ చెబుతోంది. అలాగే దేశీయంగా కూడా ఈ సంవత్సరం బీఫ్ వినియోగం బాగా పెరిగిందట!2024లో భారతదేశంలో మూడు మిలియన్ టన్నుల బీఫ్ వినియోగం అయ్యిందట. ఈ సంవత్సరం అది అంతకు మించి ఉండవచ్చని మూడు మిలియన్ టన్నుల పై స్థాయిలోనే బీఫ్ ను భారతీయులు భుజించే అవకాశాలున్నాయని ఈ సంస్థ అంచనా వేసింది!ఒకవైపు బీఫ్ తినడంపై నానా రచ్చలు జరుగుతూ అప్పుడప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. బీఫ్ తీసుకెళున్నారని దాడులు కూడా జరిగాయి. అయితే మీట్ ఎక్స్ పోర్ట్స్ విషయంలో మాత్రం ఇండియా దూసుకుపోతూ ఉంది. ఈ వ్యాపారంలో అనేక సంస్థలు ఆరితేరాయి. ప్రభుత్వం కూడా దీన్ని వ్యాపారంగానే చూస్తూ ఉంది. రాజకీయం సంగతెలా ఉన్నా.. బీఫ్ ఎక్స్ పోర్ట్స్ విషయంలో ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమీ లేవు! ఎగుమతుల వ్యాపారంతో విదేశీ మారకద్రవ్యం వస్తుంది. దీనికి బీఫ్ కూడా ఏం మినహాయింపు కాదు కదా!

## ఆడుదాం ఆంధ్రా అవకతవకలపై కమిటీ

అమరావతి,ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన అవకతవకల పట్ల పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు చాలా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శాసన మండలిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించడానికి ఒక ఇండిపెండెంట్ కమిటీతో విచారణ వేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట తప్పుచేసిన అధికారులు ప్రజా ప్రతినిధుల పాత్రల గురించిన రిపోర్ట్ సభకు అందజేస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కోసం గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, జిల్లా కలెక్టర్స్ ద్వారా ఖర్చు చేశారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

# ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

అమరావతి, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యేల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఖరారు చేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు పవన్ సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఐదు స్థానాల్లో ఒకరి అభ్యర్థి పేరు ఖరారైంది. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేస్తూ పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నాగబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకుంటారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు ఈ భేటీ జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ఎంపికపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.అంతకుముందు నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ రావడాన్ని గమనించిన జనసేన ఆయనకు రాజ్యసభకు పంపాలని భావించారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో నాగబాబును పంపించాలని అనుకున్నప్పటికీ ఆ స్థానాన్ని ఖాళీ చేయించింది బీజేపీ కాబట్టి... ఆ స్థానాన్ని కమలం పార్టీకి వదలాలి అనే సూచనలు కూడా వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం ఉదయం సీఎం చంద్రబాబు తో మాట్లాడిన తర్వాత పవన్ కళ్యాణ్... ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ను ఎంపిక




చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు జనసేన పొలిటికల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ అధికారికంగా జనసేన గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈనెల పదవ తేదీలోపు నామినేషన్ వేయాల్సిన నేపథ్యంలో మంచి రోజు చూసుకుని నాగబాబు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అలాగే మిగిలిన నలుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు కూడా ప్రకటించగా.. ఐదుగురు కలిసి నామినేషన్ వేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక ఐదుగురు ఎమ్మెల్సీలో నాగబాబు పేరు ఖరారవగా.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అయితే నాగబాబు రాజ్యసభకు వెళ్తే ఐదు ఎమ్మెల్సీల్లో ఒకటి టీడీపీ నుంచి వంగవీటి రాధాకు ఇస్తారనే అంతా భావించారు. కానీ ఇప్పుడు ఎమ్మెల్సీగా నాగబాబు పేరు ఖరారు చేయడంతో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈరోజు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశం అనంతరం ఎమ్మెల్సీలు ఎవరనేది ప్రకటించనున్నట్లు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com